RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 340 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 12 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-



## రైతు రుణమాఫీ అమలు పై రేవంత్ గుడ్ న్యూస్

# అధికారిక ఆమోదం!?

## 18న క్యాబినెట్‌లో తుదిరూపు!!

హైదరాబాద్ : రైతు రుణమాఫీ అమలుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. రైతురుణమాఫీని ఆగస్టు 15లోగా చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 18న జరగనుంది. ఈ భేటీ లో రైతు రుణమాఫీ అమలు పైన విధి విధానాలను అధికారికంగా ఆమోదించనున్నారు. అలాగే రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించి సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు ఎలా ఉండాలన్న దానిపై కూడా క్యాబినెట్‌లో చర్చించాలని నిర్ణయించారు.

**ప్రభుత్వం కసరత్తు :** రైతు రుణమాఫీకి సంబంధించి రేవంత్ సర్కార్ కసరత్తు ప్రారంభించింది. ఆగస్టు 15లోపు రుణాలు మాఫీ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన మేరకు ఈ ప్రక్రియను మొదలుపెట్టారు. రుణమాఫీకి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రూ 2లక్షల వరకు రైతు రుణ మాఫీ అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో ఆగస్టు 15 లోగా రుణమాఫీ అమలు చేస్తామని రేవంత్ పలు ప్రాంతాల్లో ప్రమాణం చేసి చెప్పారు. దీనికి సంబంధించి ప్రాధమికంగా కసరత్తు పూర్తయింది.

**మార్గదర్శకాలు సిద్ధం :** 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 10వ తేదీ వరకు రైతులు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కాలాన్ని పంటల రుణమాఫీ కాలాన్ని ప్రభుత్వం నిర్ధేశించి.. రైతుల రుణాలకు సంబంధించిన సమాచారం కోసం బ్యాంకర్లతోనూ చర్చలు జరిగాయి. ఆ దిశగానే రుణాలను మాఫీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అమలు మార్గదర్శకాల పైన అధికారులు ఇప్పటికే సూత్రప్రాయంగా నివేదిక అందించారు. దీని పైన ఈ నెల 18న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి అధికారికంగా ఆమోద ముద్ర వేయనున్నారు. తంలో రుణమాఫీ చేసినప్పుడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తింపజేశారు.. ఈ అంశంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**18న అధికారిక ఆమోదం :** తెలంగాణలో రైతు రుణమాఫీ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు నేరుగా జమ అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వంలోని కొన్ని శాఖల నుంచి ఆ కార్పోరేషన్ కు తిరిగి ఆ మొత్తం చెల్లించేలా నిర్ణయం జరిగింది. కొందరు రైతులు బ్యాంకు రుణాలు తీసుకుని.. రెన్యువల్ చేసుకోలేదు. మరి వారికి మాఫీ వర్తిస్తుందా అన్నది చూడాలి.

ఈ దిశగా బ్యాంకర్లతో వ్యవసాయ, ఆర్థికశాఖ ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. రుణమాఫీ అమల్లో ఎక్కువ మందికి లబ్ది జరిగేలా నిర్ణయం ఉండాలని రేవంత్ భావిస్తున్నారు. దీంతో..ప్రభుత్వం ప్రకటించే విధి విధానాల పైన ఆసక్తి కనిపిస్తోంది.

## ఏఇఇ అభ్యర్థులకు అపాయింట్మెంట్ లెటర్స్ ఇవ్వాలి: ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పుడో పూర్తయినా తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థులకు ఇంతవరకూ అపాయింట్మెంట్ లెటర్స్ ఇవ్వకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. గాంధీ భవన్ వద్ద మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఏఇఇ అభ్యర్థులకు ఎక్స్(ట్విటర్)



వేదికగా ఆయన సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏఇఇ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి వివిధ దశల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్చి నెలలోనే అభ్యర్థుల డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేసినా.. ఇప్పటికీ నియామక పత్రాలు ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు.

రాష్ట్ర మంత్రులు, అధికారులకు అభ్యర్థులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి ఏఇఇ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

## టీటీడీపీలోకి మాజీ మంత్రి మల్లారెడ్డి..!?




హైదరాబాద్: తెలంగాణ తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తన ముఖ్య అనుచరులతో గత రెండు రోజులుగా మల్లారెడ్డి సమావేశం నిర్వహించినట్లు విశ్వాసనీయ సమాచారం. తిరిగి సొంతగూటికి చేరే ఆలోచనలో మల్లారెడ్డి ఉన్నట్లు సమాచారం. 2014 వరకు మల్లారెడ్డి టీడీపీలో ఉన్న విషయం తెలిసిందే. టీడీపీలో ఎంపీగానూ పనిచేశారు. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా పనిచేశారు. మల్లారెడ్డి సంస్థల చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో ఆ పార్టీకి జోష్ వస్తుందని మల్లారెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి దాడులు తగ్గాలంటే అధికారంలో ఉన్న పార్టీలో చేరుతానని తన అనుచరులతో మల్లారెడ్డి చెబుతున్నట్లు తెలుస్తోంది. టీటీడీపీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉండటంతో మల్లారెడ్డి ఈ పదవీపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చంద్రబాబుతో ఉన్న పరిచయాలతో ఆయన టీటీడీపీలోకి వెళ్లనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆరుగురిని నిందితులుగా చేర్చారు. కాగా మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు మొత్తం ఆరుగురిపై అభియోగాలు మోపారు.

ఇప్పటి వరకు నలుగురిని అరెస్ట్ చేశారు. కాగా అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్‌లు దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే తమను అరెస్టు చేసినట్టు నిందితుల తరపున లాయర్లు వాదనలు వినిపించారు. ఈ కేసులోసాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ వాదనలు వినిపించారు. చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కేసును ఇంకా విచారించాల్సింది చాలా ఉందని, కాబట్టి బెయిల్ మంజూరు చేయొద్దన్న పీపీ వాదించారు. కాగా ఇరువురి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. బెయిల్ పిటిషన్లపై తీర్పును నాంపల్లి కోర్టు (బుధవారం) ప్రకటించనుంది.




## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి

# సర్వం సిద్ధం

## ముఖ్య అతిథులు వీళ్లే!

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. కేసరపల్లి ఐటీ పార్కు ప్రాంగణంలో ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. దీంతో ప్రధాని పర్యటనకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం లో అధికారులతో సీఎస్ సమీక్షించారు. టూర్ ప్రోగ్రాం ప్రకారం ప్రధాని రేపు ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఉ.10.55 గం.లకు అక్కడ సమీపంలోని ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ వెళ్లనున్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..** ప్రమాణ స్వీకారం నేపథ్యంలో బుధవారం విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విజయవాడ నగరం నుంచి గన్నవరం వెళ్లే వాహనాలను పోలీసులు మళ్లించనున్నారు. విజయవాడ రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి వెళ్లే వాహనాలతో పాటు.. అంబులెన్స్, అత్యవసర ఆరోగ్య చికిత్స వాహనాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. అలాగే గన్నవరం వెళ్ళే ఇతర వాహనాలు అన్నిటినీ నిలిపి వేయనున్నారు. కేవలం పాసులు ఉన్న వారికే అనుమతి ఇవ్వనున్నారు. ఇక విజయవాడలో సాధారణ వాహనలు కూడా మళ్లించనున్నారు. విజయవాడ నుంచి ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుంచి కంకిపాడు–పామర్రు–హనుమాన్ జంక్షన్–ఏలూరు వైపు మళ్లిస్తారు. అలాగే.. వియవాడ వెలుపల ట్రాన్స్ పోర్టు వాహనాలను మళ్లించనున్నారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నూజివీడు జి. కొండూరు ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుండి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనుముడి వారధి, రేపల్లె, బాపట్ల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు మేదరపెట్ల, అద్దంకి, నరసరావుపేట, పిడుగురాళ్ళ, మిర్యాలగూడెం, నల్గొండ నుంచి వెళ్లాల్సి ఉంటుంది.

ఇక హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లు వాహనాలు నల్గొండ, మిర్యాలగూడెం, దాచేపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట, అద్దంకి, మేదరమెట్ల నుండి మళ్లించనున్నారు. విజయవాడ ఏలూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను PNBS నుంచి ఓల్డ్ PCR జంక్షన్, ఏలూరు రోడ్, హోటల్ స్వర్ణ పాలెస్, చుట్టుగుంటగుణదల , రామవరప్పాడు రింగ్, ఇన్నర్ రింగ్ రోడ్, నున్న బైపాస్, నూజివీడు, హనుమాన్ జంక్షన్, ఏలూరు వైపుకు మళ్లించనున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## బీజేపీకి కొత్త అధ్యక్షుడు అక్కడ నుంచే ?

భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు అవసరం పడింది. 2020 నుంచి నాలుగేళ్ల పాటు జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన జేపీ నడ్డా తాజాగా కేంద్ర మంత్రివర్గంలో చేరారు. దాంతో బీజేపీ కొత్త ప్రెసిడెంట్ ఎవరూ అన్న చర్చ వస్తోంది. అసలే కేంద్రంలో బీజేపీకి పూర్తి బలం లేదు. మ్యాజిక్ ఫిగర్ కి 32 సీట్లు కొరత ఉంది. దాంతో టీడీపీ జేడీయూల మీద ఆధారపడి బీజేపీ ప్రభుత్వం నడపాల్సి ఉంది. ఈ క్లిష్ట పరిస్థితులలో బీజేపీని మిత్రులతో కలుపుకుంటూ ఎక్కడా పొరపొచ్చాలు లేకుండా ఎన్డీయే సర్కార్ నడపాల్సిన బాధ్యత కొత్త అధ్యక్షుడి పైన ఉంది. ఒక విధంగా చెప్పాలీ అంటే బీజేపీ నూతన అధ్యక్షుడికి ఈసారి పెను సవాల్ ఎదురు కాబోతోంది అని అంటున్నారు. మిత్ర పక్షలతో సమన్వయం చేసుకుంటూ పోవాలి. అయిదేళ్ల పాటు పార్టీని ప్రభుత్వాన్ని అనుసంధానించి నడపడం ఆషామాషీ వ్యవహారం అయితే కాదు. అయితే బీజేపీ వరసగా రెండు సార్లు పూర్తి మెజారిటీతో గెలిచి ఈసారి చతికిల పడడం పట్ల పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. 2019లో 304 సీట్లు దక్కాయి. ఈసారి 240 మాత్రమే బీజేపీకి వచ్చాయి. అంటే ఏకంగా 64 సీట్లు కోత పడ్డాయి. దేశానికి గుండె కాయ లాంటి యూపీలో 80 ఎంపీ సీట్లు ఉంటే బీజేపీకి దక్కినవి 32 మాత్రమే. దాంతో యూపీలో మరో మూడేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సి ఉంది. అలాగే ఈ ఏడాది చివరిలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. అక్కడ ప్రస్తుతం అధికారంలో బీజేపీ మిత్రపక్షాలు ఉన్నాయి. కానీ పార్లమెంట్ లో ఈ పార్టీలకు దెబ్బ తగిలింది. శివసేన ఎన్సీపీలను చీల్చిన ఫలితాన్ని జనాలు బీజేపీకి ఓట్ల ఆగ్రహం రూపంలో చూపించారు. దాంతో బీజేపీ మహారాష్ట్రలో గెలవడం అంటే చాలా శ్రమించాల్సి ఉంది. అలాగే బీహార్ లో వచ్చే ఏడాది ఎన్నికలు ఉన్నాయి. అక్కడ ఇండియా కూటమి బలంగా ఉంది. అలాగే పశ్చిమ బెంగాల్ తో పాటు మరికొన్ని రాష్ట్రాలలో బీజేపీ బలం పెంచుకోవాల్సి ఉంది. ఈ మొత్తం పరిణామాలను బేరీజు వేసుకున్న మీదటనే బీజేపీకి జవసత్వాలు అందించే కొత్త ప్రెసిడెంట్ కావాలని భావిస్తున్నారు. అందుకే జేపీ నడ్డాకు కేంద్ర మంత్రి పదవి ఇచ్చి పక్కన పెడుతున్నారు. ఇక ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారికే బీజేపీ కొత్త ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగిస్తారు అని అంటున్నారు. మోడీ కూడా ఈ విషయంలో అంగీకారం తెలిపారు అని అంటున్నారు. ఇక మీదట బీజేపీ పాలనను ఆరెస్సెస్ మరింత జాగ్రత్తగా గమనిస్తుంది అని అంటున్నారు.

# ఏటికేడు జాప్యం.. సాగునీటికి కష్టం



పెద్దపల్లి : ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు ప్రతిపాదనలు కార్యరూపం దాల్చకపోవడంతో ఏటా సాగునీరు వృథాగా పోతోంది. జిల్లాలో ప్రధానమైన డి-83, డి-86 కాలువలతో పాటు వాటి ఉప కాలువలు కూడా చాలా చోట్ల దెబ్బతిన్నాయి. పంచాయతీల చొరవ, ఉపాధిహామీ పథకంతో చిన్నపాటి మరమ్మతులు, పూడికతీత పనులు జరుగుతున్నాయి. భారీగా దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

20 ఏళ్ల కిందట వేసిన సిమెంటు లైనింగ్ దెబ్బతినడం, తూములు, డ్రాపులు, యూటీలు ప్రవాహ ఉద్ధృతికి పాడవడంతో తరచూ కాలువలకు గండ్లు పడుతున్నాయి. దీంతో రైతులే సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతు చేసుకొని, పంటలను కాపాడుకుంటున్నారు. నీటి వినియోగ సంఘాలు రద్దు కావడంతో కాలువల నిర్వహణ అటకెక్కి, చివరి భూములకు నీరందడం లేదు. ఫలితంగా ఏటా చివరి భూములకు నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యూటీల నిర్మాణానికి ప్రతిపాదనలు పెద్దపల్లి నీటిపారుదల డివిజన్ పరిధిలో మూడు యూటీ(అండర్ టన్నెల్)ల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలకు మోక్షం లభించింది. సుమారు రూ. 1.8 కోట్లతో వీటిని చేపట్టనున్నారు. జూలపల్లి మండలం కుమ్మరికుంట సమీపంలో ఒకటి, పాలకుర్తి మండలం కన్నాల, కుక్కలగూడూరు గ్రామాల వద్ద మరో రెండు యూటీలను నిర్మించనున్నారు. వీటిని బండరాయితో నిర్మించాలని రైతుల నుంచి డిమాండ్ రావడంతో పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

**స్థానిక నిధులతోనే..**

పంట కాలువల్లో చిన్న చిన్న మరమ్మతులకు నిధుల కోసం ప్రయత్నిచడంతో కాలయాపన జరుగుతోంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు పంచాయతీ సహకారంతో ఉపాధిహామీ నిధులతో పనులు చేసేలా పంచాయతీలను ప్రోత్సహిస్తున్నాం. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో మాత్రం నిధుల కోసం ప్రతిపాదనలు పంపించి, పనులు చేపడుతున్నాం.

-కె.శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ, పెద్దపల్లి డివిజన్

**శిథిలావస్థలో కాలువలు**

కాల్వశ్రీరాంపూర్: డి 83 పరిధిలోని ఆర్ ఎస్ డి-4 కాలువ పెద్దపల్లి మండలం గుర్రాంపల్లి నుంచి వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఇద్లాపూర్ వరకు వచ్చే కాలువ శిథిలావస్థకు చేరింది. పలు చోట్ల తూములు, కాలువ సీసీ పాడయ్యాయి. డి 86 పరిధిలో ఓదెల మండలం నుంచి పందిల్ల, తారుపల్లి, మొట్లపల్లి, చిన్నరాతుపల్లి, మల్యాల గ్రామాల్లో కాలువలు పాడయ్యాయి. మరమ్మతులకు ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు.

# ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం అక్రమాలకు పాల్పడుతున్నారు : పాడి కౌశిక్ రెడ్డి



హైదరాబాద్ : రామగుండంఫ్లై యాష్ తరలింపులో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బూడిద తరలింపులో మంత్రి అదనంగా రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు.

ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 13 లారీలను తానే స్వయంగా పట్టుకున్నట్లు తెలిపారు. రవాణా శాఖ అధికారులు రెండు లారీ లను మాత్రమే సీజ్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఎన్టీపీసీ అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడే అందరి పేరు రెడ్ బుక్‌లో రాస్తున్నాం, మేం అధికారంలోకి వచ్చిన నాడు అందరి బండారం బయటపె డుతామన్నారు. ఇది బెదిరింపు కాదు, మీ బాధ్యత మీకు గుర్తు చేస్తున్నామని స్పష్టం చేశారు. అక్రమార్కులపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు శుభవార్త

హైదరాబాద్: సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారసుల గరిష్ఠ వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని 2018 మార్చి 9 నుంచి అమలు చేయనున్నట్టు సింగరేణి వెల్లడించింది.



# ఇక.. పనుల పరుగు!

కరీంనగర్ : రెండు కార్పొరేషన్లు, 14 పురపాలికల పరిధిలో దాదాపుగా 160 వరకు కొత్త పనులను తక్షణమే ప్రారంభించాల్సిన అవసరముంది. మార్చి 16వ తేదీ నుంచి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలులో ఉండటం వల్ల పట్టణాల్లో నూతన పనుల ప్రస్తావనే లేకుండా పోయింది. వర్షాకాలం ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలో గుర్తించిన అత్యవసర పనులకు టెండర్లు పిలిచి వరదల వల్ల ఎదురయ్యే ఇక్కట్లను తొలగించే పనులను పాలకవర్గాలు చేపట్టాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో ఆగిన పనులు కొనసాగించడంతోపాటు కొత్తవాటిని చేపట్టేందుకు సంబంధిత అధికారులు రంగంలోకి దిగుతున్నారు. నాలుగు జిల్లాల కలెక్టర్లు ఇందుకు సంబంధించి డీపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో 1,218 గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు వెంటనే చర్యలు తీసుకునే దిశగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామసభలో నిర్ణయించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు మోక్షం కలిగించాల్సి ఉంది. కోడ్ ముగియడంతో కొత్తగా నిర్మించాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, సామూహిక భవనాల పరంగా దృష్టిని సారించాల్సి ఉంది.కరీంనగర్ నగర పాలకసంస్థ పరిధిలోని మల్టీపర్పస్ పార్కులోని పనులను శుక్రవారం మేయర్ సునీల్‌రావు, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టిసారించారు. దీంతోపాటు 60 డివిజన్ల పరిధిలో ఈ వర్షాకాలం ముందర అంతర్గత రహదారులు సహా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు అవసరమైన కొత్త పనులకు ఒకట్రెండు రోజుల్లో శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. 80 రోజులుగా...ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగియడంతో ప్రభుత్వ పాలనకు, ఆగిన పనులకు అడ్డంకి తొలగింది. దాదాపు 80 రోజులపాటు కొత్త పనులు, ఆగిన పనులు, నూతన పథకాల లబ్ధి, అందాల్సిన సంక్షేమం విషయంలో స్తబ్ధత నెలకొంది. లోక్‌సభ ఎన్నికల సందడిలోనే నాయకులు, అధికారులు మునిగిపోయారు. చాలా గ్రామాలు, పట్టణాల్లో గతంలో హామీలు ఇచ్చి నిధులు మంజూరైన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. పైగా కోడ్ సమయంలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు పర్యవేక్షించడానికి వీలు కుదరలేదు. దీంతో ఎక్కడి పనులక్కడే అనే పరిస్థితి నాలుగు జిల్లాల పరిధిలో కనిపించింది. పాలనాధికారులతో పాటు ఆయా శాఖల జిల్లాధికారులు ఎన్నికల బాధ్యతలో తీరిక లేకుండా ఉండటంతో ప్రజలకు చేరువవ్వాల్సిన పాలన ప్రయోజనాలు ఆగిపోయాయి. తాజాగా ఎన్నికల సంఘం కోడ్ ముగిసిందని ప్రకటించిందే తడువుగా యంత్రాంగమంతా ఆగమేఘాలమీద జరగాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి పెడుతోంది.

**ఇలా అన్నింటిపై...**

ఈ నెల 12వ తేదీతో పాఠశాలలు పునః ప్రారంభమవబోతున్నాయి. మన ఊరు- మనబడి ద్వారా ఉమ్మడి జిల్లాకు రూ.300 కోట్లు కేటాయించారు. ఇందులో సగం పనులు మాత్రమే పూర్తయి మిగతావి జరగాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం మారిన తరువాత అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఈ పనుల ప్రగతిని పర్యవేక్షించాలని నిర్ణయించారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరవడంతో వీటిపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. చాలాబడులు పోలింగ్ కేంద్రాలకు వినియోగించడంతో విద్యుత్తు, ఇతర సౌకర్యాలున్నా.. అదనపు గదుల నిర్మాణాల్ని శరవేగంగా చేపట్టాల్సి ఉంది. మూత్రశాలలు వీలైనంత తొందరగా పూర్తి చేయాలి.ఎమ్మెల్యేలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇచ్చిన ప్రత్యేక నిధులతో చేపట్టాల్సిన పనులపై దృష్టి పెట్టారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ద్వారా రూ.10కోట్ల నిధులను ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లో పనుల కోసం వినియోగించాలి. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఈ నిధులను తొలి ప్రాధాన్యంగా కేటాయించేందుకు ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి గడిచిన 10 వారాలుగా నిలిచిపోయింది. దీంతో గతంలో బాధితులు ఇచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం దొరకలేదు. ఈ నెల 10వ తేదీ నుంచి కలెక్టరేట్లలో యథావిధిగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజల సమస్యల్ని తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ కనబర్చాల్సి ఉంది.. ఉమ్మడి జిల్లాలో ప్రతి సోమవారం సగటున 850 నుంచి 950 వరకు బాధితులు దరఖాస్తులను అందిస్తారు. ఇందులో అప్పటికప్పుడు పరిష్కరించాల్సినవి కొన్ని ఉంటే.. ఇంకొన్ని విధిగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సినవి ఉంటాయి. పైగా లబ్ధిదారులుగా ఎంపిక చేయాల్సినవి ఇంకొన్ని ఉంటాయి. పథకాల అమలు, సంక్షేమం, వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్లు దృష్టిపెట్టబోతున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లను నిర్వహించి తగు సూచనలు చేశారు. గ్రామస్థాయిలో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాపై అత్యవసర సర్వే చేయించాలని పంచాయతీ అధికారులకు, పాఠశాలల ప్రారంభోత్సవం నాటికి విద్యార్థులకు ఎఆ శాఖలు అదే పనిలో ఉన్నాయి.

# ఆరోగ్య ఉపకేంద్రాల ఊసేది..

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వైద్యారోగ్యం గాలిలో దీపంలా మారింది. కొత్తగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం కోసం రూ.లక్షలు వెచ్చించినా ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. ఏ ఉప కేంద్రం ఎప్పటికి అందుబాటులోకి వస్తుందని తెలుసుకోలేని స్థితిలో వైద్యారోగ్య శాఖ ఉంది. పనులు మంజూరై రెండేళ్లు గడిచినా నిర్మాణాలు పూర్తికాకపోవటం విమర్శలకు తావిస్తోంది. గ్రామీణ ప్రాంత పేద, సామాన్య ప్రజలకు సర్కారు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో రూ.11.40 కోట్లతో కొత్తగా 57 ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి అనుమతులిచ్చింది. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాల పరిధిలోకి వచ్చే 35 ఉపకేంద్రాలకు 2021 మార్చిలో టెండర్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా పరిధిలోకి వచ్చే 22 ఉపకేంద్రాలకు 2023 మేలో రెండు విడతల్లో ప్రభుత్వం టెండర్ నిర్వహించింది. తొలుత రూ.16 లక్షల విలువ చేసే పనులకు, రెండోసారి రూ.4 లక్షలకు జరిగిన ఈ పనులను ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేసి వైద్యారోగ్య శాఖకు అప్పగించాలనేది ప్రభుత్వ ఒప్పందం. ఈ పాటికే నూతనంగా నిర్మించిన ఉపకేంద్రాల ద్వారా వైద్య సేవలను అందించాల్సి ఉంది. కానీ పనులు పూర్తి కాలేదు. స్థానికంగా రాజకీయ ప్రాబల్యం కలిగిన వారే టెండర్లను దక్కించుకోవటమే కాకుండా సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు జరగలేదని తెలుస్తోంది.

**కొత్తగా చేపట్టాల్సినవి ఇవి..**

ఆదిలాబాద్ జిల్లాలో అందూర్, చింతల్‌బోరి, గిమ్మ, గుంజాల, సాలెవాడ, తలమద్రిలో నూతన ఉపకేంద్రాలను నిర్మించాల్సి ఉంది. కుమురంభీం జిల్లాలో చింతలమానెపల్లి, రవీంద్రనగర్, కర్జవల్లి, బీబ్రా, ఇటిక్యాల, చింతగూడ, బట్టుపల్లి, కాగజ్‌నగర్ గ్రామీణం, కోసిని, వంజరి, ఐడబ్ల్యూ కేంద్రం, రాంనగర్, కౌటాల, మొగడ్‌దగడ్, రెబ్బెన, నంబాల, నవేగావ్, ఖైరిగావ్, దపే కుంచవల్లి, గిరివెల్లి, హత్తిని, పంబాపూర్, పరందోళి, సిర్పూర్(యు), పంగిడి, దేవాయిగూడ, ఉల్లిపిట్ట, డోర్లి, ముత్యంపేట భవనాలను నిర్మించాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో కుస్లీ, లక్ష్మణచాంద, చిట్యాల, మేడిపల్లి, సోన్, రత్నాపూర్‌కాండ్లి, బోరిగాం, జావ్లా, కోలూర్, పల్సి, చాత, కల్లూరు, లింబా(కె), ఎగాం, పెంబి, ఇటిక్యాల, అంకెన, గంగాపూర్, మద్దిపడగ, దస్తూరాబాద్, ముథోల్, నిగ్వాలో కొత్త ఉపకేంద్రాలను నిర్మించాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి ఇది బోథ్ మండలం అందూర్‌లో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం. ఇంకా ప్రారంభం కాలేదు. రంగులు వేసిన గోడలను చూస్తే మొత్తం పూర్తయినట్లు కనిపిస్తున్నా పూర్తిస్థాయి పనులు జరగలేదు. లోపలి గదుల్లో నేలపై వేసిన టైల్స్ కుంగిపోతున్నాయి. విద్యుత్తు, నీటి సరఫరా సౌకర్యం లేదు. మిగిలిన ఉపకేంద్రాల పరిస్థితి అటూ ఇటుగా దాదాపుగా ఇలాగే ఉంది.

**త్వరలో అందుబాటులోకి తెస్తాం**

నర్సింగరావు, ఈఈ, టీజీఎంఎస్ఐడీసీ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉన్నా ఎన్నికలు, కూలీల కొరత, వేసవి కారణంగా కొంత జాప్యం జరిగింది. త్వరలో పనులన్నీ పూర్తిచేయిస్తాం. ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

# పనులు చేపట్టాలి.. సౌకర్యాలు కల్పించాలి

ఆదిలాబాద్: టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ పట్టణ ఆర్థిక సమగ్ర అభివృద్ధి సంస్థ) పథకం కింద జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో రూ.2 కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనులు మధ్యలో నిలిచాయి. దాదాపు కిలోమీటరు వరకు ఇరువైపులా తవ్వకాలు జరిపి వదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రధాన రహదారికి ఇరువైపులా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. సుందరీకరణ పనుల్లో భాగంగా పాదబాట ఏర్పాటుకు రోడ్డును తవ్వి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఎన్నికల కోడ్ ముగియడంతో పనులు వేగంగా చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గుంతలతో ఉన్న ఈ రోడ్లు జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లోనివి. అధ్వానంగా ఉన్న రోడ్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రుల్లో ఈ దారిపై ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదవశాత్తు కిందపడిపోతు న్నారు. ఇక్కడ టీయూఎఫ్ఐడీసీ కింద సీసీ రహదారులు నిర్మించడానికి 'పుర' అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులకు ఆమోదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడుతామని అధికారులు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన నేపథ్యంలో పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై 'పుర' పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గతేడాది శాసనసభ ఎన్నికలకు ముందు జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలకు మంజూరైన నిధులతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు అప్పటి భారాస ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చేపట్టడకుండా కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పాలకవర్గాల సూచనల మేరకు పంపించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించే తరుణంలో పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో పట్టణాల్లో ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక, 15వ ఆర్థిక సంఘం, టీయూఎఫ్ఐడీసీ, సాధారణ నిధులతో వార్డుల్లో సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలతోపాటు అవసరం ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మూడు మున్సిపాలిటీల్లో ఉన్న రూ.69.01 కోట్ల నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం వెచ్చించాల్సి ఉంది.

180 పనులుటీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ) కింద జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలకు రూ.69.01 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మూడు పట్టణాల్లోని 80 వార్డుల్లో 180 పనులు చేపట్టడానికి 'పుర' అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు, పార్కులు, మినీ స్టేడియం అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, ఇతరత్రా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులు, మున్సిపల్ పాలకవర్గం సూచించిన విధంగా పనులు చేపట్టాలని భావించినా పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రతిపాదనలకు ఆమోదం లభించలేదు. ఇప్పుడు కోడ్ ముగియడంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం లభించేలా పాలకులు, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది. వీటిపై దృష్టి పెట్టండిజిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో గతంలో చేపట్టిన సుందరీకరణ పనులు పూర్తిచేయాలి. నిర్మల్‌లోని ధర్మసాగర్ చెరువు (మినీ ట్యాంక్‌బండ్) వద్ద టీయూఎఫ్ఐడీసీ కింద రూ.65 లక్షల పనులు చేపట్టాల్సి ఉంది. నిర్మల్‌లో రూ.7.20 కోట్లతో తలపెట్టిన సమీకృత మార్కెట్ పనులు నిధుల లేమితో నిలిపివేశారు. గాంధీ కూరగాయల మార్కెట్, ప్రయాణ ప్రాంగణం ఎదుట, ఈద్గాం చౌరస్తా, మంచిర్యాల రోడ్, వివేక్‌చౌక్ ప్రాంతాల్లోని రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. నిర్మల్‌తోపాటు ఖానాపూర్, భైంసా పట్టణాల్లో ఈ పనులు వేగంగా పూర్తి చేయించాలి. భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనూ టీయూ ఎఫ్ఐడీసీ కింద చేపట్టాల్సిన సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలు భారీ వర్షాలకు కురియకముందే త్వరగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# పూత రాలి.. తెగుళ్లు పెరిగి

మెదక్ : మామిడికి ఏటా తెగుళ్ల బెడద పట్టిపీడిస్తోంది. నవంబర్, డిసెంబర్‌లో చలి తీవ్రత, తేనె మంచు, బూడిద, నల్లతామర తెగుళ్ల సమస్య ఉంటోంది. దీంతో ఈసారి మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు దళారుల బెడద రైతులను వేధిస్తోంది. అందువల్ల సాగు రైతులతో పాటు కౌలుదారులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. మొదటిదశ పూతకు సంబంధించిన కాయలు తెంపడం కొనసాగుతోంది. మలి విడత కాయలను మరో పక్షం రోజుల్లో కోయనున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వపరంగా మామిడి కొనుగోలు చేపట్టి దళారుల నుంచి నష్టం రాకుండా చూడాలని రైతులు సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 2500–3000 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. సాగులో మొదటి దశలో వివిధ తెగుళ్లతో కొంతమేర పూత, పిందెలు రాలిపోయాయి. వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలిచిన పూతకు సంబంధించి రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో కొంతమేర దిగుబడులు వచ్చాయి. మొదటిదశ పూత ద్వారా కాసిన కాయలను ప్రస్తుతం తెంపుతున్నారు. ఇంకో వారం, పది రోజుల్లో ఇవి పూర్తికానున్నాయి. రెండో దశ పూత నుంచి తెగుళ్లను తట్టుకొని దాదాపు 60 శాతం నిలవడంతో ప్రస్తుతం వాటి కాయలు ఉన్నాయి. ఇవికూడా మరో 15 రోజుల్లో తెంపనున్నారు.

దళారుల ఇష్టారాజ్యం

ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కిలోకు రూ.80–90 పలుకుతోంది. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న పంట కావడంతో ఏటా హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటారు. కానీ ఈ ఏడాది కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సైతం



దిగుబడులు తక్కువగా ఉండడంతో ఇప్పట్లో ధరలు తగ్గే అవకాశం లేదు. మరోవైపు మామిడి రైతులకు దళారుల బెడద తప్పడం లేదు. వీరు నిర్ణయించిన ధరకే విక్రయించాలి. లేకపోతే కొనుగోలు చేసేవారు లేకుండా పోతారని రైతులు వాపోతున్నారు.

రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టాం
– సాయిలు, కౌలు రైతు, వ్యాపారి

గత 15 ఏళ్ల నుంచి పండ్ల వ్యాపారం చేస్తున్నాను. రెండేళ్ల నుంచి పలు రకాల తెగుళ్ల కారణంగా మామిడి దిగుబడి తగ్గింది. ఈ ఏడాది అయినా ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని మెదక్–కామారెడ్డి జిల్లాలో రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి 40 ఎకరాల మామిడి తోటలను కౌలుకు తీసుకున్నాం. కానీ తేనె మంచు తెగుళ్ల వల్ల పూత రాలిపోయి కాత తగ్గింది. ఇప్పుడే కోతలు ప్రారంభించగా, ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ ఏడాది సైతం నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

అవగాహన కల్పించాం
– నర్సయ్య, జిల్లా ఉద్యానశాఖ అధికారి

తెగుళ్లు పూతను తినేస్తున్న విషయం తెలియగానే పలు మామిడి తోటలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశాం. పూత దశలో వచ్చే తెగుళ్ల నివారణకు ఉద్యానశాఖ అధికారులు చెప్పే సూచనలు పాటించాలి. సాధారణంగా పూసిన పూతలో 90శాతం రాలిపోగా మిగిలిన 10శాతమే కాయలు కాస్తాయి. కానీ ఈ ఏడాది కేవలం 2శాతం పూత మాత్రమే మిగలడంతో దిగుబడి తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 90 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

# వాడిన విరులూ.. ఆదాయపు సిరులే

శివ్వంపేట: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితం ఖాయం. ఈ కోవకే చెందుతారు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన మహిళలు. వాడిన పూలతో అగర్‌బత్తీలు తయారుచేస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆదాయాన్ని ఆర్జిస్తుంటం విశేషం. గ్రామంలో ఇటీవల సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ గ్రామంలో స్వయం ఉపాధి పొందే తీరుపై అవగాహన కల్పించింది. అందుబాటులో ఉన్న వనరులు, అవకాశాల ను సంస్థ ప్రతినిధులు వివరించారు. దీంతో గ్రామానికి చెందిన భూలక్ష్మి, పెద్ద పద్మ, చిన్న పద్మ, లావణ్య, కల్పనలు అడుగు ముందుకేశారు. వినియోగించిన పూలతో అగర్‌బత్తీలను తయారు చేసేందుకు ముందుకొచ్చారు. సంస్థ సహకారంతో..: సదరు మహిళలకు సెహగల్ ఫౌండేషన్ అన్ని రకాలుగా సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. రూ. 1.50 లక్షలు ఇవ్వగా.. నలుగురు కలిసి రూ.1.20 లక్షలు జమచేసుకున్నారు. వీటితో అగర్‌బత్తీల తయారీ యంత్రం, ముడి సరుకులు కొనుగోలు చేసి కుటీర పరిశ్రమ తరహాలో ఏర్పాటుచేసుకున్నారు. అగర్‌బత్తీల తయారీ విధానంపై మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రెండు నెలల కిందట తయారీని షురూ చేశారు. ఆలయాల్లో వినియోగించిన పూలతో..: ఈ మహిళలు ముందుగా మండలంలోని ఆలయాల్లో దేవుళ్లకు వినియోగిస్తున్న పూలను సేకరిస్తున్నారు. చిన్నగొట్టిముక్కల పరిధిలోని దాకరిమొట్ల సహకార ఆంజనేయ స్వామి, శివ్వంపేటలోని బగలాముఖి



శక్తిపీఠం తదితర ఆలయాల నుంచి వినియోగించిన పూలను తీసుకొస్తున్నారు. వాటిని బాగా ఎండబెట్టి పొడిగా మారుస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా అగర్‌బత్తీలను యంత్రం సాయంతో తయారుచేస్తున్నారు. వీటి విక్రయానికి సెహగల్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. ప్రస్తుతం స్థానికంగా విక్రయిస్తున్నారు. త్వరలోనే యాదగిరిగుట్ట, ఇతర పెద్ద ఆలయాల్లో విక్రయించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ విషయమై సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి వేమ నారాయణ మాట్లాడుతూ.. మహిళలు ముందుకు వస్తే సంస్థ ద్వారా ఉపాధి మార్గాలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# పుడమికి బలం.. జగతికి జీవాధారం



తాండూరు : తాగునీటి ఎద్దడి నివారణకు, భూగర్భ జలాల పెంపుదలకు 'ఇంకుడు గుంతలకు' మించిన చక్కటి మార్గం మరొకటి లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేళ్ల క్రితం వరకు వీటి తవ్వకానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాయి. కరవు పరిస్థితులను అధిగమించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతానికి ప్రధానంగా మున్సిపాలిటీల్లో ప్రజలు సైతం చొరవ చూపారు. తరువాత దీనిపై అటు ప్రభుత్వం ఇటు ప్రజలు ఆసక్తి చూపక పోవడంతో ఉన్నవన్నీ పూడుకుపోయి ఆనవాళ్లే కానరాకుండా పోయాయి. ప్రస్తుతం ఎండలు భరించలేని స్థితిలో ఉన్నాయి. చెరువులు, కుంటలు అడుగంటి పోతున్నాయి. ఇలాంటి తరుణంలో మళ్లీ కరవు పరిస్థితులు తలెత్తకుండా పట్టణాల్లో అందరూ 'ఇంకుడు గుంతల' తవ్వకానికి ముందుకు రావాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో వీటి అవసరం, గత పరిస్థితులపై కథనం.

నిబంధనల అమలు ఎక్కడ..

జిల్లాలో పరిగి, తాండూరు, కొడంగల్, వికారాబాద్ మున్సిపాలిటీలున్నాయి. వీటిలో కొత్తగా భవనాల నిర్మాణాలు చేసే వారు ఇంకుడు గుంతను విధిగా నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. అధికారులు మాత్రం ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పారుతున్న వరద వృథాగా పోతుంది. దీనికి తోడు గృహాల్లో వివిధ అవసరాలకు వినియోగించిన నీరు కూడా కాలువల ద్వారా వెళ్లి పోతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో నిర్మించిన ఇంకుడు గుంతల నిర్వహణ సవ్యంగా లేక భూమికి సమాంతరంగా మారి పోయాయి.

2019లోనే లక్ష్య నిర్దేశం

నిర్ణీత పరిమాణాల్లో తవ్విన గుంతల్లో కంకర, ఇసుక, గులకరాళ్లను పొరలుగా పోస్తారు. వీటిలోకి వచ్చిన వరద నీరు, వృథా నీరు భూమిలోకి ఇంకి పోయి జల మట్టం పెరుగుతుంది. ఈ అంచనాతో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి 2019–20 ఆర్థిక సంవత్సరంలో 2,560 ఇంకుడు గుంతలు నిర్మించాలనే లక్ష్యాన్ని మున్సిపాలిటీలు పెట్టుకున్నాయి. ఒక్కో ఇంకుడు నిర్మాణ స్థితిని బట్టి రూ.6వేల నుంచి రూ.8వేల వరకు చెల్లించేందుకు నిర్ణయించింది. అయితే ఈ విషయంలో అవగాహన కల్పించక పోవడంతో నిర్ణీత లక్ష్యం ఇప్పటికీ నెరవేరలేదు.

ఒక్కో మున్సిపాలిటీలో ఇవి పరిమిత సంఖ్యలోనే పూర్తవడం విశేషం.

ప్రత్యేక శిలాఫలకం ఆవిష్కరించినా..

తాండూరులో ఇంకుడు గుంతల నిర్మాణానికి 2017లో అప్పటి ప్రభుత్వం రూ.4లక్షలను మంజూరు చేసింది. అదే ఏడాది జనవరి 30న అప్పట్లో రవాణా శాఖ మంత్రిగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిధుల ఆధారంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో దాదాపు 67 ఇంకుడు గుంతలను నిర్మించాల్సి ఉండగా పట్టించుకోలేదు. నిధులు వెనక్కి వెళ్లి పోయాయి. శిలాఫలకం మాత్రం వెక్కిరిస్తోంది.

# ఆడిటోరియంగా సినారె కళా మందిరం



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ ప్రాంతంలో కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద మండల పరిషత్ కాంపెక్స్‌లో నిర్మించిన సినారె కళా మందిరాన్ని ఆడిటోడిరియంగా మార్చడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉన్న భవనానికి మార్పులు, చేర్పులు చేసేందుకు అంచనాలు రూపొందిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా సినారె కళా మందిరం కళావిహీనంగా మారింది. దీనిని మండల పరిషత్ నుంచి మున్సిపల్‌కు అప్పగించడంతో మున్సిపల్ చెత్త ఆటోలకు నిలయమైంది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, రాజ్యసభ మాజీ సభ్యుడు దివంగత సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) తన నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించడంతో అన్ని హంగులతో విశాలమైన భవనాన్ని నిర్మించి 2002లో ప్రారంభించారు. ఏదేని సమావేశం నిర్వహిస్తే దాదాపు వేయి మంది కూర్చోవడానికి వీలుగా కట్టారు. అప్పటి నుంచి ఇది కళాకారులకు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. క్రమంగా ఈ భవనాన్ని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో కళావిహీనంగా మారింది. రెండేళ్ల క్రితం ఈ భవనాన్ని మున్సిపల్‌కు అప్పగించారు. దీంతో ఆవరణలో చెత్త ఆటోలు పెట్టడానికి వినియోగిస్తున్నారు. దీనిని పూర్తిగా తొలగించి రూ.5 కోట్లతో నూతన భవనం నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేయగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తరవాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు మొదలు పెట్టలేదు. ఈ భవనం నిర్మించి తక్కువ కాలం కావడంతో దానిని అలాగే ఉంచి ఆడిటోరియంగా మార్చడానికి అధికారులు ప్రస్తుతం ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

మరమ్మతులతో పూర్వ వైభవం

సినారె కళామందిరం నిర్మించి దాదాపు 22 ఏళ్లు అవుతుంది. దీనిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం భవనంలో సీలింగ్ ఊడి పోవడం, విద్యుత్తు వైరింగ్ పాడవ్వడం, తలుపులు, కిటికీల అద్దాలు పగిలిపోవడం వంటివి జరిగాయి. ఈ భవనానికి మరమ్మతులు చేస్తే పూర్వ వైభవం సంతరించుకోనుంది. గతంలో ఇందులో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ సందర్భాల్లో పెద్ద ఎత్తున సమావేశాలు జరిగేవి. జిల్లా స్థాయిలో పలు మార్లు జాతీయ యువజన దినోత్సవాలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంలో ఎన్నికల సామగ్రి నిల్వ చేసేందుకు వినియోగించేవారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను ఇందులో నిర్వహించారు. అనేక రకాలుగా ఉపయోగపడే ఈ భవనాన్ని గత కొన్నాళ్లుగా పట్టించుకునే నాథుడు లేక అపరిశుభ్రంగా మారింది. రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు ఆడిటోరియంగా మార్చి వినియోగంలోకి తీసుకొస్తే కళాకారులు, పట్టణవాసులకు ఉపయోగపడనున్నది.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

ప్రస్తుతం ఉన్న భవనం స్థానంలో కొత్తది నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు ఉత్తర్వులు వచ్చినప్పటికీ నిధులు విడుదల కాలేదు. అందువల్ల పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఉన్న భవనానికి మార్పులు, చేర్పులు చేసి ఆడిటోరియంగా మార్చాలనే ఆలోచన ఉన్నతాధికారుల్లో ఉంది. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భవనంలో కొన్ని నిర్మాణాలు తొలగించడం, మరికొన్ని చేపట్టి ఆడిటోరియంగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.– సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ

# బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం ఖరారు

బోయినపల్లి : స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాల సభ్యులు చిరు వ్యాపారం, కుట్టు మిషన్, ఇతర వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి నెలా రుణ వాయిదాలను బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని 40,827 మహిళా సంఘాలకు రూ.2,489.03 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని బ్యాంకులో పొదుపు చేస్తుంటారు. సంఘాల పని తీరు, పొదుపు ఆధారంగా బ్యాంకులు రుణాలను అందిస్తున్నాయి. ప్రతి సంఘానికి వారి అవసరం మేరకు అర్హత ఆధారంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటిని పొందిన సభ్యులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు. అధికంగా సభ్యులు కుట్లు, అల్లికలు, వస్త్ర దుకాణం, కిరాణం, పేపర్ ప్లేట్ల తయారీ, చేతి రుమాళ్లు, పాడి పరిశ్రమపై ఆధారపడి ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా వడ్డీతో సహా బ్యాంకులో చెల్లిస్తున్నారు.

గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.372.33 కోట్లు అధికం

గత ఆర్థిక సంవత్సరంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 36,993 మహిళా సంఘాల సభ్యులకు రూ. 2,116.7 కోట్ల రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు అధికారులు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యుల అవసరాల మేరకు, గత రుణాల చెల్లింపు ఆధారంగా రుణాలను మంజూరు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు చేయగా, పలు మండలాల్లో లక్ష్యానికి మించి ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40,827 సంఘాలకు రూ. 2,489.03 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. గతంలో నిర్దేశించిన లక్ష్యం కంటే రూ. 372.33 కోట్లు అధికం. గత ఆర్థిక సంవత్సరంలో కంటే 3,834 మహిళా సంఘాలు పెరిగాయి.

లక్ష్యం మేరకు పంపిణీ చేస్తాం– శేషాద్రి, డీఆర్డీవో

స్వశక్తి మహిళా సంఘాలకు గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు వందశాతం అందించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం మేరకు ఇవ్వడానికి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలు అందిస్తాం. మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి. క్రమం తప్పకుండా తిరిగి రుణాలు చెల్లించాలి.

# జలఘంటిక.. మేల్కొవాలిక

హైదరాబాద్ : రాజధానిలో భూగర్భ జలాలు ఆవిరవడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తంగా.. గతంతో పోలిస్తే తాగునీటి సరఫరా సమయం, నీటి ఒత్తిడి చాలా వరకు తగ్గింది. సంపులోని నీరు సగం రోజుకే తరిగిపోతున్నాయి. దాంతో.. వేలాది మంది రోజూ ట్యాంకర్ల కోసం జలమండలిని సంప్రదిస్తున్నారు. పలు ప్రభుత్వ ఆఫీసులు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లలోనూ నీటి ఎద్దడి కనిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు నీటి ట్యాంకర్ల సాయంతో అవసరాలను తీర్చుకుంటున్నారు. అదే సమయంలో.. కొన్ని కాలనీ సంఘాలు పొదుపు మంత్రం పఠిస్తున్నాయి. ఎండలు పెరుగుతుండటంతో సమస్య తీవ్రమవుతుందని, జలమండలి నీటి సరఫరాను యథాతథంగా కొనసాగిస్తున్నప్పటికీ.. భూగర్భ జలాలు అడుగంటడంతో సమస్య తలెత్తిందని అధికారులు గుర్తు చేస్తున్నారు.

టీ కప్పులు కడిగేందుకూ.. కటకట

మాసబ్‌ట్యాంక్ సమీపంలోని ఓ ప్రభుత్వ భవన సముదాయంలో రోజు విడిచి రోజు నీటి సమస్య ఎదురవుతోంది. దాంతో.. టీ కప్పులను శుభ్రం చేసేందుకు కూడా నీరు ఉండట్లేదని సిబ్బంది వాపోతున్నారు. ఇదేంటని ఆరాతీస్తే.. జలమండలి ద్వారా వచ్చే నీరు త్వరగా అయిపోతోందని, బోరుబావి ఎండిపోవడం వల్ల ట్యాంకర్లను తెప్పించుకుంటున్నామని, ఆ నీరు కూడా సరిపోవట్లేదని అధికారులు తెలిపారు.

మార్చిలో ఏకంగా 1.69 లక్షల ట్రిప్పులు

గ్రేటర్ వ్యాప్తంగా నీటి ట్యాంకర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో నీటి సరఫరా కోసం జలమండలి ట్యాంకర్ల వైపు చూస్తున్నారు. దీంతో ఒకేసారి ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాది ఒక్క మార్చి నెలలోనే 1.68 లక్షల ట్రిప్పులను జలమండలి సరఫరా చేసింది. గతేడాది మార్చి నెలతో పోల్చితే 56 వేల ట్రిప్పులు అదనంగా అందించారు. వానలు లేకపోతే



మే నెలలో మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా 660 ఎంజీడీల వరకు నీటి డిమాండ్ ఉండగా.. జలమండలి 560 ఎంజీడీల వరకు సరఫరా చేస్తోంది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య దాదాపు 100 ఎంజీడీలు తేడా ఉంది. రోజూ జలమండలికి ట్యాంకర్ల కోసం 4900 వరకు ఫోన్లు వస్తుండగా.. 6584 ట్రిప్పులు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిత్యం 7 వేల ట్రిప్పులు పెండింగ్‌లో ఉంటున్నాయి. చాలా ప్రాంతాల్లో ట్యాంకర్ బుక్ చేసిన 2–3 రోజులకు కూడా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 24 గంటలపాటు సరఫరా చేయాలని జలమండలి ఇప్పటికే నిర్ణయించింది.

కేంద్రాల తనిఖీ..ఫిల్లింగ్ కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం కొన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. మణికొండ, నేతాజీపార్కు, షేక్‌పేట ఫిల్లింగ్ కేంద్రాలను తనిఖీలు చేసి అక్కడ లాగ్ బుక్‌లను పరిశీలించారు. ప్రస్తుతం 75 ఫిల్లింగ్ కేంద్రాల్లో 121 పాయింట్ల ద్వారా ట్యాంకర్లు అందిస్తున్నామని, త్వరలో మరిన్ని ఫిల్లింగ్ కేంద్రాలను, ట్యాంకర్లను పెంచనున్నట్లు ఎండీ చెప్పారు.

'అలేఖ్య' ఆదర్శం.. ఈతకొలను మూసేద్దాం

ఎండాకాలం వచ్చిందంటే గేటెడ్ కమ్యూనిటీల్లోని ఈతకొలనుల్లో పిల్లలు, పెద్దలు జలకాలాడుతుంటారు. చెప్పాలంటే ఈతకొలనులే గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రత్యేక ఆకర్షణ. నీటి ఎద్దడి కారణంగా ఈసారి స్వచ్ఛందంగానే పలుచోట్ల సొసైటీల్లోని ఈతకొలనులను మూసేస్తున్నారు. బెంగళూరులోని పరిస్థితి మన దగ్గర రాకూడదని ఎల్బీనగర్‌లోని అలేఖ్య టవర్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ముందు జాగ్రత్తగా ఈసారి తమ కమ్యూనిటీలోని ఈత కొలనును తాత్కాలికంగా మూసేయాలని నిర్ణయించింది. సిటీలో పెరుగుతున్న నీటి కొరతను గమనించి ఈ నిర్ణయం తీసుకుందని గృహ యాజమాని ఒకరు తెలిపారు. తమ కమ్యూనిటీలో నీటికొరత లేదని.. అయితే బయట చాలా ప్రాంతాల్లో తాగడానికి, వాడుకోవడానికి నీటికి ఇబ్బంది పడుతుంటే.. తాము జలకాలాటలు ఆడటం సరికాదని భావించి సొసైటీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

# మూసీ ఒడ్డున నిర్మాణాలొద్దు.. నదికి ఇరువైపులా ఆంక్షలు

హైదరాబాద్: మూసీనది నుంచి 50 మీటర్ల పరిధిలో నిర్మాణ, లేఅవుట్ అనుమతులను నిలిపేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. వేర్వేరు సంస్థల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులనూ అనుమతించవద్దని కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వు జారీ చేశారు. ఆదేశాలను వెంటనే, నదికి ఇరువైపులా అమలుచేయా లని జోనల్ కమిషనర్లు, ఉప కమిషనర్లు, ప్రణాళికాధికారులు, సహాయ ప్రణాళికాధికారులను ఆదేశించారు. ఎంఆర్‌డీసీఎల్(మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అభ్యర్థన మేరకు బల్దియా ఈ నిర్ణయం తీసుకుంది.సమగ్రాభివృద్ధి దిశగా..: మూసీని.. సంపదను సృష్టించే వనరుగా ఉపయోగించుకోవాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష. అందులో భాగంగా నదిని సర్వే చేయాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు సర్వేయర్ల ఆధ్వర్యంలో ఇటీవలి వరకు సర్వే జరిగింది. బఫర్ జోన్‌లో నిర్మాణ పనులను అధికారులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్రస్థాయి పరిశీలనతో..'ఈనాడు' సైతం ఇటీవల కథనాన్ని ప్రచురించింది. వాటన్నింటినీ ఎంఆర్‌డీసీఎల్ పరిగణలోకి తీసుకొని. నది పొడవునా ఎలాంటి కట్టడాలను అనుమతించవద్దని సంబంధిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు, జీహెచ్‌ఎంసీకి లేఖ రాయగా.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ తాజా ఉత్తర్వును జారీ చేశారు. మూసీ నదిలో ఇప్పటికే 10వేల ఆక్రమణలను అధికారులు గుర్తించారు. బఫర్ జోన్‌పై అయోమయం ఉండేది. దాంతో.. కొందరు అధికారులు బఫర్ జోన్‌లోనూ అనుమతులు ఇచ్చేవారు.




## ఇజ్రాయెల్ సైన్యం దూసుకొస్తే.. బందీలను కాల్చివేయండి: హమాస్ హెచ్చరిక!

గాజాలో ఉద్ధృత పోరు కొనసాగుతోంది. ఇటీవల హమాస్ చెరలో ఉన్న నలుగురు బందీలను విడిపించేందుకు ఇజ్రాయెల్ నిర్వహించిన ఆపరేషన్లలో స్థానికంగా భారీగా ప్రాణనష్టం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హమాస్ నుంచి తీవ్ర హెచ్చరిక వచ్చినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. టెల్అవీవ్ దళాలు ముందుకు చొచ్చుకొని వస్తున్నాయని భావిస్తే..బందీలను కాల్చివేయాలని తమ దళాలకు అగ్రనేతల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. గత ఏడాది అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్పై మెరుపుదాడి చేశారు. ఈక్రమంలోనే దాదాపు 250 మందిని కిడ్నాప్ చేసి గాజాకు తరలించారు. నవంబరులో ఇరుపక్షాల నడుమ కాల్పుల విరమణ సమయంలో కొంతమందిని విడిచిపెట్టారు. ఇంకా 120 మంది హమాస్ చెరలో ఉన్నారని ఇజ్రాయెల్ చెబుతోంది. వారిని గాజాలోని జనసమ్మర్థ ప్రదేశాలు, సొరంగాల్లో ఉంచినట్లు సమాచారం. దీంతో.. వారిని కాపాడటం టెల్అవీవ్కు సవాల్గా మారుతోంది. వారిని గుర్తించేందుకు డ్రోన్లు, శాటిలైట్లు వంటి వాటితో ఇజ్రాయెల్, అమెరికా నిఘా విభాగాలు, మిలిటరీ నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు పిలుపునిస్తూ.. అమెరికా ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐరాస భద్రతామండలి ఆమోదించింది. 14 ఓట్లు అనుకూలంగా రాగా.. రష్యా ఓటింగ్కు దూరంగా ఉంది. ఈ సంధి ప్రణాళికకు ఇజ్రాయెల్ అంగీకరించింది.

అయితే హమాస్ నుంచి అంగీకారం రావాల్సి ఉంది. తాము గాజాలో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే హమాస్ వెల్లడించింది. ఈ ఘర్షణకు శాశ్వత ముగింపు ఉండాలని షరతు విధించింది. దీనిని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇదిలా ఉంటే.. ఇటీవల బందీలను విడిపించేందుకు చేసిన ఆపరేషన్ వీడియోలను ఇజ్రాయెల్ మిలిటరీ విడుదల చేసింది.




## 'పరీక్షకున్న గౌరవం దెబ్బతింటుంది'.. నీట్ 2024 రద్దు పిటిషన్లపై సుప్రీం

దిల్లీ: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ – 2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. పరీక్షను క్యాన్సిల్ చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. "ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలి" అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. ఇక, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఎన్టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ –2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు.

అయితే తొలుత జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పి.. అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

## కేంద్రంలో తెలంగాణ మంత్రులు..ఏం సాధిస్తారు?



హైదరాబాద్ : తెలంగాణ నుంచి తాజాగా ఇద్దరికి కేంద్రంలో మంత్రి పదవులు దక్కాయి. అయితే.. వాస్తవానికి గతంలోనూ ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చారు. 2014–19 మధ్య కిషన్ రెడ్డి, దత్తాత్రేయలు కేంద్రంలో మంత్రులుగా ఉన్నారు. వీరివల్ల ఒరిగింది ఏమీ లేదనే విమర్శలు అప్పట్లో మూటగట్టుకున్నారు. ఇక, మోడీ 2.0లో కిషన్ రెడ్డికి మాత్రమే మంత్రి పదవి దక్కింది. అది కూడా.. పర్యాటక శాఖ స్వతంత్ర హోదాలో కట్టబెట్టారు. దీంతో ఆయన పెద్దగా చేసేందుకు స్కోప్ లేకుండా పోయింది. ఇక, ఇప్పుడు ఫైర్ బ్రాండ్ బండి సంజయ్కి తొలిసారి, కిషన్ రెడ్డికి మరోసారి అవకాశం చిక్కింది. అయితే.. ఇప్పుడు కూడా.. ఏమేరకు వారు తెలంగాణకు సాయం చేస్తారనే విషయంలో సందేహాలు ముసురుకున్నాయి. దీనికి కారణం.. బండి సంజయ్.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా అవకాశం చిక్కించుకున్నారు. కానీ, దీని వల్ల తెలంగాణకు పెద్దగా అవకాశం లేదు. తెలంగాణ వాదం.. కోరికలు.. ఇతరత్రా నెరవేర్చేందు కు పెద్దగా చాన్స్ ఉండే అవకాశం కనిపించడం లేదు. ఉన్నా కూడా.. బండి సంజయ్కు పరిమితమైన అవకాశాలు మాత్రమే ఉంటాయి. సికింద్రాబాద్ కంటో న్మెంటు సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. అయితే.. దీనికి కూడా హోం శాఖ మంత్రిగా ఉన్న అమిత్ షా సంతకం అవసరం. చిత్రం ఏంటంటే.. గతంలో కిషన్ రెడ్డి కూడా సహాయ మంత్రిగా పనిచేశారు. కానీ, ఆయన కూడా ఈ సమస్యను పరిష్కరించలేక పోయారు. ఇక, బండి సంజయ్ ఏమేరకు సక్సెస్ అవుతారో చూడాలి. ఇక, తాజాగా మంత్రివర్గంలో మరో సారి చోటు దక్కించుకున్న కిషన్ రెడ్డికి.. బొగ్గు, గనుల శాఖను కేటాయిం చారు. ఇది ఒకరకంగా కీలకమైన శాఖేనని చెప్పాలి. ఎందుకంటే సింగరేణి బొగ్గు గని దేశంలో కెల్లా పెద్దది. దీనికి మరింత ప్రాధాన్యం పెంచేందుకు సమస్యలు తగ్గించేందుకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా ఏపీలో గనుల వ్యవహారాల విషయంలో కూటమి ప్రభుత్వానికి సాయం చేయొచ్చు. అయితే.. ఏమేరకు పనిచేస్తారనేది చూడాలి. మొత్తంగా ఇద్దరికి అవకాశం చిక్కినా.. ఒక్కరికి మాత్రం ప్రాధాన్యం ఉన్న పదవి దక్కడం గమనార్హం.

## హైదరాబాద్ హోటళ్లలో కల్తీ.. మంత్రి వార్నింగ్

హైదరాబాద్: ఆహార కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హోటల్స్ అసోసియేషన్లతో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి.. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై సానుకూల స్పందించారు. "హైదరాబాద్ బిర్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. హైదరాబాద్ను మెడికల్ టూరిజం హబ్గా తీర్చిదిద్దుతున్నాం. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను పెంచుతున్నాం. హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వర్క్ షాప్ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తాం" అని మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. కాగా, పురుగులు పట్టిన పిండి.. చింతపండు, బూజు పట్టిన క్యారెట్లు.. గడువు తీరిన సాస్.. కిచెన్లలో అపరిశుభ్రత.. ఇలా జిల్లా పరిధిలో ఉన్న రెస్టారెంట్లు, హోటళ్లు, ఫుడ్ కోర్టుల్లో లభించే ఆహారం ప్రజారోగ్యానికి హానికరంగా మారింది.



ఫుడ్ సేఫ్టీ అధికారులు వారం రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నా మొక్కుబడిగా మారాయన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించగా సాచిపోయిన, బూజు పట్టిన ఆహార పదార్థాలు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు నోటీసులు

హైదరాబాద్: ఛత్తీస్గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో కేసీఆర్కు నోటీసులు అందాయి.

–ఈనెల 15 లోగా వివరణ ఇవ్వాలంటూ జస్టిస్ నర్సింహారెడ్డి ఈ నోటీసులు జారీ చేశారు. కాగా విచారణకు హాజరయ్యేందుకు జులై 30 వరకు సమయం కావాలని కేసీఆర్ కోరారు. మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. నిన్న (సోమవారం) మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు.

**ఎంత నష్టం అనేది తేల్చాల్సి..** కాగా మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్కే జోషి, అరవింద్ కుమార్లతో ఇవ్వాళ (మంగళవారం) సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్ఘడ్కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్యలేదని పేర్కొన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని అన్నారు.

## విమర్శించిన వారికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పారు.. - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: అంబర్పేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని విమర్శలు చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు ప్రజలు ఓటు ద్వారా సరైన గుణపాఠం చెప్పారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, కోశాధికారి ఏ.సూర్యప్రకాషసింగ్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎక్కాల నందు, ఎక్కాల కన్నా తదితరులు కలిసి శాలువా, పూలబోకేతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఈ నియోజకవర్గ ప్రజలు అందించిన మెజారిటీతోనే ఎంపీగా రెండోసారి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని అన్నారు.

## అఫిడవిట్ సమర్పించాలని కాళేశ్వరం ఇంజినీర్లకు చెప్పాం: జస్టిస్ పీసీ ఘోష్



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. 3 ఆనకట్టల బాధ్యతలు చూసిన ఇంజినీర్లను విచారిస్తున్నామని, అఫిడవిట్ ద్వారా అన్ని విషయాలు తెలపాలని వారిని ఆదేశించినట్లు జస్టిస్ పీసీ ఘోష్ మీడియాకు తెలిపారు. "జూన్ 25లోపు నివేదిక సమర్పించాలని ఇంజినీర్లందరికీ చెప్పాం. అఫిడవిట్ ద్వారా అయితే అన్ని అంశాలు రికార్డు అవుతాయి. బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్లు కనిపిస్తోంది. లోపం ఎక్కడుంది? ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా విచారణకు పిలుస్తాం"అని జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఇంటి వద్ద గురుకుల అభ్యర్థుల నిరసన

హైదరాబాద్: తమకు న్యాయం చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద గురుకుల అభ్యర్థులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. గురుకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని, గురుకుల బోర్డు వల్ల తాము నష్టపోయామన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న గురుకుల అభ్యర్థులు.. బోర్డు చేసిన తప్పులను తమపై రుద్దొద్దని, తమకు న్యాయం చేయాలని కోరారు. సరైన పద్ధతిలో నియామక ప్రక్రియ జరుగకపోవడంతోనే ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. తద్వారా చాలా మంది నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము కూడా కోర్టుకు వెళ్లామని, న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయినా తమకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఇన్నాళ్లు ఎన్నికల కోడ్ అని సాగదీశారని, ఇప్పుడు స్కూళ్లు కూడా ప్రారంభమవుతున్నాయని తమకు ఇంకెప్పుడు న్యాయం



చేస్తారంటూ నిరసన వ్యక్తంచేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660